

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 63 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

బిహూటిన్యేన్' (ప్రణామములు) అని వినయంగా కృష్ణరాయల పాదాలకు నమస్కరించాడు ఇర్విన్. భాష పూర్తిగా అర్థం కాకున్నా చిన్న చిన్న మాటలు, పలకరింపులు అర్థం చేసుకుంటున్నాడు కృష్ణరాయలు. 'చిరంజీవ' అంటూ ప్రేమగా భుజాలు పట్టుకుని లేవదీశాడు.

'హాల్లో బ్రూడేర్ ! హూ హోహెట్ మెట్యే' (సోదరా! ఎలా ఉన్నారు) అంటూ చిరునవ్వుతో రెండుచేతులూ జోడించింది 'లేడీ హాలె'. కుశలమే అన్నట్లు చిరునవ్వుతో తలపంకించి ప్రతి నమస్కారం చేశాడు కృష్ణరాయలు. కూర్చొమ్మన్నట్లు ఆసనాన్ని చూపించాడు. 'బెడంక్ట్' అని ధన్యవాదం తెలుపుతూ భర్త ప్రక్కనున్న ఆసనంపై కూర్చున్నదామె.

'హూ హో హెట్ క్లైనే ప్రిన్సస్' (తమరెలా ఉన్నారు యువరాణీ) అంటూ కృష్ణరాయల ముద్దులపట్టికి నాటకీయంగా వంగి అభివాదం చేశాడు ఇర్మిన్. 'హేలుక్కిగ్ వాష్టే నుహ్ వాష్టేన్ (సంతోషంగా అతిథులకోసం ఎదురుచూస్తున్నాము) అంటూ అంతే నాటకీయంగా వంగి నమస్కరించింది చిన్నారి లలిత. పెద్దల నవ్వులకు జత కలిపారు పిల్లలిద్దరూ.

పరిచారికలు పట్టు పరదాలు పక్కకు తొలిగిస్తుండగా బయటకు వచ్చింది కృష్ణరాయల అర్ధాంగి. తనపాదాలకు నమస్కరించిన 'ఇర్మిన్'ని లేవనెత్తింది ఆశీస్సులు అందిస్తూ. అంబ్రాస్ దంపతులకు నమస్కరించి తనకోసం సిద్ధం చేసిన ఆసనంలో కూర్చున్నది. పరిచారికలకు పండ్లు పానీయాలు తెమ్మని పురమాయిస్తుండగా ప్రహరీ దగ్గర రేగిన చిన్న కలకలం అందరి దృష్టినీ ఆకట్టుకుంది. ఆ అరుపులు స్పష్టంగా వినబడగానే ఇర్మిన్, లలితల ముఖాలలో చిరునవ్వులు పూచాయి.

ఆ తరువాత అక్కడి వారందరూ కనిపించిన దృశ్యాన్ని నోళ్ళు తెరుచుకుని కనులు వెళ్ళబెట్టుకుని చూశారు ముందు. మైమరచి బిగ్గరగా నవ్వుతూ చూడసాగారు ఆ తరువాత. ముక్తివరం గ్రామ వడ్లబత్తుడు నాగాచారి కొడుకు నాగాంజనేయాచారి విచిత్రమైన అరుపులతో మధ్య మధ్య పెద్దగా నవ్వుతూ ప్రాంగణంలోకి దూసుకొచ్చాడు. అతడి వెనుకే పెద్ద కఱ్ఱతో తండ్రి నాగాచారి పరుగులు తీస్తూ వచ్చాడు.

'ఆగు ఆగు' అని అరుస్తూ కొడుకును మాటలతో ఆపడానికి శతవిధాలా ప్రయత్నం చేస్తున్నాడు నాగాచారి. మధ్య మధ్య చేతిలో కఱ్ఱను యథాశక్తి ఉపయోగించడానికి ప్రయత్నిస్తున్నాడు. పక్కకూ ముందుకూ దూకుతూ తండ్రి కఱ్ఱ దెబ్బలను తప్పించుకుంటూ, బతిమిలాడుకుంటూ ముప్పు తిప్పలు పెడుతున్నాడు కొడుకు. వగరుస్తూ ఆగిపోయాడు నాగాచారి. చేతి కఱ్ఱను చంకలో ఇరికించుకుని అంతెత్తు వసారాలో గద్దె మీద కూర్చుని నవ్వుతూ చూస్తున్న కృష్ణ రాయలకు నమస్కరించాడు. నడుముకు చేతులు ఆనించి ఆయాస పడుతూ తనూ ప్రేక్షకుడిలా కొడుకు చేష్టలను చూస్తుండిపోయాడు.

'ఆగు' అంటూ తనను పట్టుకోడానికి ముందుకొచ్చిన కృష్ణరాయల అంగరక్షకుల మధ్యనుండి ఉడతలా దూకి తప్పించుకున్నాడు నాగాచారి కొడుకు. వాళ్ళు కోపంతో, రోషంతో వెంటబడటంతో ఆగకుండా ముందుకు

పరుగెత్తాడు. నిలువెత్తునున్న వెదురు కంచెను గుర్రంలా ఎగిరి దూకాడు. వాడిని గమనించి విసురుగా కదిలి అడ్డు వచ్చిన కృష్ణరాయల గుర్రం కాళ్ళ సందునుండి పిల్లిలా క్షణంలో దూరి పోయాడు. రెట్టించిన కోపంతో, అవమానం జరిగినట్లు, కసిగా వెంబడించారు కృష్ణరాయల అంగరక్షకులు.

పదేళ్ళక్రితం సమర్థ రాముడి విశ్రాంతికోసం వేయించిన పర్ణశాల చుట్టూ పరుగులు పెట్టాడు నాగాచారి కొడుకు. అశ్వశాలలో, గోశాలలో స్తంభాలాట ఆడుతూ చిక్కినట్టే చిక్కి మెలికలు తిరుగుతూ తప్పించుకున్నాడు. రివ్వున మామిడి తోటలోకి పరుగెత్తాడు. విశాలమైన వటవృక్షంలా పెరిగిన వింత మామిడి చెట్టు క్రింద ఇప్పుడొక రామ మందిరం ఉన్నది. ఇప్పుడుఆ మందిరం ఉన్నచోటనే పదేళ్ళ క్రితం పడగను గొడుగులా పట్టి సమర్థరాముడిని సేవించుకున్నది భయంకరమైన నల్లత్రాచు ఒకటి.

ఎన్నో ఏళ్లుగా ఆ వింత మామిడి చెట్టు కింద పెద్ద పుట్టలో అది నివాసం ఉండడం కృష్ణరాయలకు, ముక్తివరం గ్రామస్తులకు అందరికీ తెలిసిన విషయమే. కృష్ణరాయల దంపతులు, భద్రాచల రామదాసు, మహలులో పనివాళ్ళు, అంగరక్షకులు, గ్రామ ప్రజలు, అందరూ చూస్తుండగా కొన్ని ఘడియలపాటు తలమీద మూరెడు ఎత్తున మూడడుగుల వెడల్పున పడగను గొడుగులా పట్టి సమర్థ రాముడిని సేవించింది ఆ కృష్ణసర్పం.

'అమ్మా! యిక ఎక్కడికైనా వెళ్లి విశ్రాంతి తీసుకో! స్వామికి నీ సేవ యిక చాలు' అన్నాడు సమర్థరాముడు మంద్ర స్వరంతో. ఆ పలుకులు పూర్తి అయ్యీ కాకమునుపే, విశ్వాసపాత్రమైన పెంపుడుజంతువులాగా పడగముడిచి, అలాగే వెనక్కు జారిపోయింది ఆ సర్పం. వెనకనున్న పుట్టను ప్రదక్షిణగా చుట్టి ఈశాన్య దిక్కున దృఢంగా నిర్మించిన వెదురు కంచెను దాటి వెళ్ళిపోయింది సరసరా, ఎఱ్ఱని ఆకాశంలో నల్లని మెరుపులా, కోదండమునుండి వెలువడిన నాగాస్త్రంలా!

కృష్ణరాయలకు వీడుకోలు తెలిపి ముక్తివరంనుండి వెళ్ళిపోయేముందు ఆ పుట్టను నిత్యమూ భక్తి శ్రద్ధలతో పూజించాలని ఆజ్ఞాపించాడు సమర్థ రాముడు. సమయం వచ్చినప్పుడు దానిని భగవత్ప్రేరణ తనంత తానుగా తొలగించేలా చేస్తుంది అని తెలిపాడు. అప్పటిదాకా పూజాదికాలు జరగాల్సిందే అని ఆదేశించి వెళ్ళిపోయాడు. ఆనాటినుండీ సమర్థరాముడి ఆజ్ఞ మేరకు అక్కడ పూజలు కొనసాగాయి.

భద్రాచల రామదాసు వారి ఆహ్వానము మేరకు ప్రతి చైత్ర శుద్ధనవమికి భద్రాచల రాముడి కల్యాణానికి వెళ్ళేవాడు కృష్ణరాయలు. సీతారాములకు పెళ్లి పట్టుబట్టలు, కళ్యాణపు తలంబ్రాలు నెత్తిన పెట్టుకుని బ్రాహ్మీముహూర్తంలో కాలినడకన బయలుదేరేవాడు. కళ్యాణ ఘడియలు సమీపించే సమయానికి పెళ్లి మంటపానికి చేరుకొని సీతారాములకు పట్టుబట్టలు, తలంబ్రాలు సమర్పించేవాడు. గోల్కొండ ప్రభువుల ముత్యాల తలంబ్రాల అనంతరం ముక్తివరం ప్రభువుల తలంబ్రాలు సీతారాముల శిరస్సులపై మెరిసేవి. తానీషా పంపిన పట్టుబట్టల తరువాత కృష్ణరాయలు సమర్పించిన నూతన పట్టువస్త్రాలు సింగారించుకునేవారు సీతారాములు.

సమర్థరాముడు కరుణించి వెళ్ళిపోయిన మూడవ సంవత్సరం ముసురుపట్టుకున్నది చైత్రమాసంలో. చిన్న చిన్న వాగులు, వంకలు, చిత్తడి నేల నడకను మందగింపజేశాయి. గోదావరి యివతలి తీరంలో కాలుమోపుతూండగానే తలంబ్రాల సన్నాయి ఘోష వినిపించి దుఃఖంతో ఇసుకలో కూలబడిపోయాడు కృష్ణరాయలు. 'రామచంద్రా! నేను తెచ్చిన తలంబ్రాలు, పెళ్లి బట్టలు స్వీకరించకుండానే పెళ్లి చేసుకున్నావా అంటూ కుమిలిపోయాడు. 'అరవై మైళ్ళు నడిచి వచ్చానే, అయినా అందుకోలేకపోయానే' అంటూ ఆవేదనతో మూర్ఛపోయాడు.

ఆ అచేతనావస్థలో సీతా, లక్ష్మణ సమేతుడై కృష్ణరాయల కనులకు సాక్షాత్కరించాడు భద్రాద్రి రాముడు. 'ఇకపై నాకోసం ఇక్కడిదాకా నీవు రావాల్సిన అవసరంలేదు. నీ తోటలోనే నేనున్నాను. ఆ పుట్టనుండి నన్ను బయటికి తీసి నువ్వు, నీ వారసులు సేవించుకోండి' అని అనుగ్రహించాడు. స్పృహలోకి వచ్చిన కృష్ణరాయలు ఎక్కడా ఆగకుండా ముక్తివరానికి పరుగులు తీశాడు. సరాసరి తోటలోకి దారి తీశాడు. హుటాహుటిన పనివాళ్ళను రప్పించాడు. జాగ్రత్తగా ఆ పుట్టను తొలిగించారు. సీతా, లక్ష్మణ సమేతుడైన శ్రీరామచంద్రుని దివ్యమంగళ మూర్తులు కనిపించాయి. అప్పటికి సరిగ్గా రెండవ ఝాము పూర్తి అయ్యింది. ముక్తివరం గ్రామమంతా తరలి వచ్చింది.

చూస్తుండగానే చుట్టుప్రక్కల గ్రామాలకు, స్తంభాద్రికి వార్త పాకింది. పరగణా అంతా తరలివచ్చినట్టు ముక్తివరం కిటకిట లాడిపోయింది. అప్పటికప్పుడు తాటాకు పందిళ్ళు వేయించాడు కృష్ణరాయలు. మున్నేటి నీటితో స్వామిని అభిషేకించి, శుద్ధి చేసి సీతారామ కళ్యాణం జరిపించాడు. భద్రాచల రాముడి ఆజ్ఞమేరకు ఆయనకోసం సిద్ధం చేసిన తలంబ్రాలను, పట్టుబట్టలను ముక్తివరం రాముడికి సమర్పించాడు. రామ దర్శనంతో ముక్తివరం మూడవ అయోధ్య అయ్యింది. సీతాకళ్యాణంతో మూడవ మిథిల అయ్యింది.

ఆనాటినుండీ ప్రతి చైత్ర శుద్ధనవమి నాడు భద్రాచల రాముడి కళ్యాణం ఐన నాటి అర్ధరాత్రి ముక్తివరం రాముడి కళ్యాణం చేయడం సంప్రదాయం అయ్యింది. భద్రాచల రాముడు పంపిన పట్టుబట్టలు, ముత్యాల తలంబ్రాలతో ముక్తివర రాముడి కళ్యాణం జరపడం ఆనవాయితీ అయ్యింది. మరునాటినుండే దివ్యమైన పాలరాతి మందిర నిర్మాణం మొదలుపెట్టాడు.

సీతమ్మ కీర్తిలాంటి ఆ తెల్లని పాలరాతి రామమందిరం చుట్టూ చిక్కకుండా పరుగులు పెట్టాడు నాగాచారి కొడుకు. ఏమనుకున్నాడో ఏమో, కనులు మూసి తెరిచేలోపు చిరుతపులిలా దాట్లు కొడుతూ కృష్ణరాయలు, అతిథులు కూర్చున్న వసారాను సమీపించాడు.

ఇంకా ఆయాసపడుతూ అంతా చూస్తున్న నాగాచారి కలవరపడుతూ ఒక్కసారి ముందుకు దూకాడు. రెండు చేతులతో కర్రను అడ్డుపెట్టడానికి ప్రయత్నించాడు. అప్పటిదాకా చోద్యం చూస్తూ విరగబడి నవ్వుతూ ఆనందిస్తున్నారు కోటలోని కొందరు పరిచారకులు, మిగిలిన అంగరక్షకులు. కృష్ణరాయలు, విదేశీ అతిథులు కూడా అసహనము, కోపము లేకుండా వినోదిస్తుండడంతో వాళ్ళూ నవ్వుతూ చప్పట్లు కొడుతూ సందడి చేస్తున్నారు అప్పటిదాకా.

'పట్టుకొండి..పట్టుకోండి' అని కొందరూ 'వచ్చే..వచ్చే..' అని కొందరూ ఉత్సాహ పరుస్తున్నారు పరుగులు పెడుతున్న అంగరక్షకులను, పరుగెత్తిస్తున్న బాలకుడిని. 'వెర్బ్యాజింగ్ వేక్వేండ్'(అద్భుతం) అంటూ అసలే పెద్దగున్న నీలి కళ్ళను యింకా పెద్దవి చేస్తూ ఆశ్చర్యపడుతున్నాడు ఇర్మిన్. కిల కిల నవ్వుతూ చప్పట్లు కొడుతూ తండ్రి ఒడిలో తెగ ఆనందపడిపోతున్నది లలిత.

కృష్ణరాయలవైపు ఆ బుడతడు రావడం మొదలెట్టగానే ముందుకు దూకి పట్టుకోడానికి ప్రయత్నం చేశారు అందరూ. వారు తనను సమీపించేలోపే ఒక్క గంతులో ఆఖరి మెట్టు మీదకు దూకి సాష్టాంగపడి మొరలు పెట్టడం ప్రారంభించాడు వాడు. 'మా అయ్య నన్ను చంపేస్తాడు. రక్షించండి' అని లబలబ లాడాడు. 'మీ కోటలోనే ఉంచుకోండి, మీ కాళ్ళ దగ్గర పడి ఉంటాను' అని మొత్తుకున్నాడు.

వాడి తండ్రిని, తన అంగరక్షకులను, కోటలో పనివాళ్లను అందరినీ వారించాడు కృష్ణరాయలు. 'నీకు వచ్చిన భయమేమీ లేదు. చెప్పు! ఏమిటీ గొడవ? ఎందుకిలా అల్లరి చేశావు' అని అడిగాడు వాడిని. తెచ్చిపెట్టుకున్న

కోపంతో మెత్తగా కోప్పడ్డాడు. నాగాచారిని అడిగాడు, ఎందుకు నీ కొడుకు వెంట పడ్డావు కర్ర పట్టుకుని? పసివాడిని కొట్టి చంపుతావా? అని మందలించాడు.

'నిండా పన్నెండేళ్ళు లేవు. చదువు చక్కదనం లేకుండా వడ్రంగం మొదలుబెట్టాడు. నన్ను పని చేసుకోనీయకుండా నా పనిముట్లు లంకించుకుంటాడు. ఎప్పుడూ ఏదో ఒకటి వంకర టింకర వస్తువు చేసి దొరగారికి చూపిస్తానంటాడు' కొడుకు నేరాలను ఏకరువు పెట్టాడు వడ్లబత్తుడు నాగాచారి.

తోక తొక్కిన త్రాచులా చివ్వున లేచాడు నాగాచారి సుపుత్రుడు. ఎర్రబడ్డ ముఖంతో, 'వంకర టింకర వస్తువులా? నా రథం రాయలోరికి చూపిస్తా. వారు మెచ్చుకొని, అద్దిరా నాగాంజనేయులూ! మన తిరునాళ్ళలో నీకో అంగడి ఇప్పిస్తా అనకుంటే నా చెవి కోయించుకుంటా' అన్నాడు కృష్ణరాయలను చూపిస్తూ. చిరునవ్వులు చిందిస్తూ, విసురుగా కొడుకు మీదికి వెళుతున్న నాగాచారిని వారించాడు కృష్ణరాయలు. 'కులవృత్తిని ప్రేమించే కొడుకుకన్నా ఇంకేం కావాలి చెప్పు?' అన్నాడు అనునయంగా.

'అద్దిరా నాగాంజనేయులూ! మన తిరునాళ్ళలో నీకో అంగడి కావాలా? సరే! ఏం రథం తయారు చేశావు? అని అడిగాడు వెక్కిరింతగా, సరదాగా నవ్వుతూ.

ముక్తివరం దుర్గా నవరాత్రులలో, వీధి నాటకంలో సైనికుడిలా వంగి వినయంగా నమస్కరించాడు వాడు. కళ్ళు మెరుస్తుండగా 'సుదర్శన రథం! సుదర్శన రథం తమరి కోసం చేశాను. తమరు ఆజ్ఞాపిస్తే సమర్పించుకుంటాను ప్రభూ' అంటూ అలాగే వంగి వెనక్కు అడుగులువేస్తూ ఎత్తైన మెట్లు దిగాడు. వీధి వైపు తిరిగి 'జాంబదూ! జాంబదూ!' అని పిలిచాడు పెద్దగా.

'వచ్చె! వచ్చే! అని కంచు బిందెలో ఊదిన శంఖంలా వినిపించింది ఒక గొంతు. నాలుగు చిన్న చిన్న చక్రాలతో వున్న చిన్న ఎద్దుల బండిలాంటి దాన్ని గొలుసుతో లాగుతూ వచ్చింది ఒక చిన్న పర్వతంలాంటి ఆకారం. ఆ బండి తొట్టిలో ఒక పెద్ద చక్రం నిలబెట్టి ఉన్నది. కొయ్యతో చేసిన చిన్న చిన్న కీళ్ళ లాంటి కర్రలు ఉన్నాయి తొట్టి నిండా. కొన్ని పదునైన కొయ్య బాణాలు ఉన్నాయి.

బండిని వదిలి, పెద్ద చక్రాన్ని, కొయ్య కీళ్ళు, కర్రలు, బాణాలు, వడ్రంగం పనిముట్ల పెట్టెను నేలమీద పెట్టి కృష్ణరాయలకు, ఓలందులకు (డచ్చివారిని ఓలందులు అని పిలుస్తారు గ్రామీణులు, హాలండ్ నుండి వచ్చినవారు అని వారి అర్థం) మిగిలిన అందరికీ, అన్ని వైపులకూ వంగి వంగి దండాలు పెట్టింది ఆ ఆకారం.

ఆ ఆకారం పేరు జాంబవంతుడు. పేరుకు తగిన ఆకారం వాడిది. వాడికి ఆ పేరు పెట్టుకొమ్మని వాడి తండ్రికి కృష్ణ రాయలే సెలవిచ్చాడు, నా బిడ్డకు తమరే పేరు పెట్టాలి దొరా అని వేడుకుంటే. గ్రామ కాటి కాపరి వీరభద్రుడి కొడుకు జాంబవంతుడు.

పనిముట్ల పెట్టెను చూడగానే కోపంతో రివ్వున ముందుకు దూకాడు నాగాచారి. చెంగున ఎగిరి వసారా పై మెట్టు మీదకు, కృష్ణరాయల రక్షణలోకి చేరుకున్నాడు నాగాచారి కొడుకు. క్షణంలో పొర్లుకుంటూ తను లాక్కొచ్చిన బండి చాటుకు మాయమైపోయాడు జాంబడు. తలవరకూ బయట పెట్టి కోపంగా గుడ్లు మిటకరించి చూశాడు నాగాచారిని.

'నాగాచారీ!' అంటూ వారించాడు కృష్ణరాయలు. కుతూహలంగా చూస్తూ అతడి కొడుకు, నాగాంజనేయాచారికి సైగ చేశాడు కానిమ్మని. ఉత్సాహంగా దూకుతున్నట్లుగా వెళ్ళాడు ఆ చిన్న బత్తుడు. పొర్లుకుంటూ బండి చాటునుండి వచ్చాడు జాంబడు. వంచిన తల ఎత్తకుండా వరుసగా ఒక్కొక్కటీ అందించడం మొదలు బెట్టాడు. యంత్రంలా చక చకా పరికరాలను అమర్చడం మొదలుబెట్టాడు నాగాంజనేయాచారి. అందరూ కుతూహలంగా చూడడం మొదలుబెట్టారు.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS